క్లుప్తంగా

అప్పన్న సన్నిధిలో ఆప్కో ఛైర్మన్ చిరంజీవి



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న గంజి చిరంజీవి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని బుధవారం రాష్ట్ర ఆప్కో ఛైర్మన్ గంజి చిరంజీవి దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించి స్వామివారి ప్రసాదం అందజేశారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు మాజీ సభ్యుడు సూరిశెట్టి సూరిబాబు చిరంజీవి వెంట ఉన్నారు.

కుట్టుమిషన్లు, వీల్‌చైర్ అందజేత



మహిళలకు కుట్టు మిషన్లు అందజేస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు

సింహాచలం: జీవీఎంసీ 95వ వార్డు పరిధి వరలక్ష్మీనగర్‌లో మహిళా మండలి సమకూర్చిన కుట్టుమిషన్లు, వీల్‌చైర్ కార్పొరేటర్ ముమ్మన దేముడు పంపిణీ చేశారు. కన్సర్న్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో టైలరింగ్‌లో మహిళలకు శిక్షణ ఇచ్చారు. వీరిలో నలుగురు మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ చేశారు. అలాగే అనకాపల్లికి చెందిన రాధాకృష్ణ ఆస్పత్రి యాజమాన్యం సమకూర్చిన వీల్‌చైర్‌ను దివ్యాంగుడికి అందజేశారు. కార్యక్రమంలో కన్సర్న్ చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ పి.కె.జోష్, మహిళా మండలి సభ్యులు చాయ, ప్రభ, భాగ్యలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు బొడ్డు దేవుడుబాబు, గంట్ల నరసింహమూర్తి, అప్పికొండ రాంబాబు, గోపాల్, ప్రభాకర్, నారాయణ పాల్గొన్నారు.

28న సింహగిరిపై రథసప్తమి పూజలు

సింహాచలం: ఈనెల 28న సింహగిరిపై రథసప్తమి పూజలు విశేషంగా నిర్వహించేందుకు వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం అధికార, వైదిక వర్గాలు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆరోజు ఉదయం ఆలయ ప్రాంగణంలో హంసమూలన ఉన్న రాతిరథంపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేసి స్నపనం, అరుణపారాయణ పఠనం, విశేష పూజలు నిర్వహిస్తారు. నిత్యకల్యాణం కూడా రాతిరథంపైనే నిర్వహిస్తారు. అలాగే సాయంత్రం సింహగిరి మాడ వీధుల్లో సూర్యప్రభ వాహనంపై స్వామికి తిరువీధి నిర్వహిస్తారు. ఈమేరకు రాతిరథాన్ని ముస్తాబు చేస్తున్నారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు సంబంధిత ఏర్పాట్లను బుధవారం పరిశీలించారు.

విశేషంగా అప్పన్న నిత్య కల్యాణం



తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30 కల్యాణ వేడుక ప్రారంభమైంది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అర్చకుడు ఆత్మకూరి రవి తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్రజాస్వామ్య ఔన్నత్యానికి ఓటు కీలకం

ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం



ప్రతిజ్ఞ చేస్తున్న దేవస్థానం ఉద్యోగులు, ట్రస్ట్‌బోర్డు సభ్యులు



సబ్బవరం మూడు రోడ్ల కూడలిలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు,విద్యార్థులు

సబ్బవరం: భారత రాజ్యాంగాన్ని అనుసరించి పౌరులకు కల్పించిన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడం ద్వారా ప్రజాస్వామ్య ఔన్నత్యాన్ని కాపాడాలని తహసీల్దార్ బి. సత్యనారాయణ కోరారు. జాతీయ ఓటర్ల దినోత్సవంలో భాగంగా బుధవారం నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. సబ్బవరం తహసీల్దార్ కార్యాలయం నుంచి మూడు రోడ్లు కూడలి వరకూ ఈ ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులతో కలిసి భారీ మానవహారం చేపట్టారు. వక్తలు భారత రాజ్యాంగం కల్పించిన హక్కులతో పాటు ఓటు హక్కు గొప్పతనాన్ని వివరించారు. తహసీల్దార్ మాట్లాడుతూ సబ్బవరం మండలంలో 56,019 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు.వీరిలో 27,660 మంది పురుషులు కాగా 28,358 మంది మహిళా ఓటర్లు ఉన్నట్లు చెప్పారు. వీరికోసం మండలంలో 68 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు.ఈ సందర్భంగా ఓటరు జాబితా రూపకల్పనలో ఉత్తమ ప్రతిభ చూపిన వీఆర్‌ఏలు,బీఎల్‌వోలను ఆయన జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వెంకట్, ఈవోఆర్‌డీ మహేష్,ఆర్‌ఐ వీరయ్య,పంచాయతీ కార్యదర్శులు,వీఆర్వోలతో పాటు అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో బుధవారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దేవస్థానం పరిపాలన భవనంలో అధికారులు, సిబ్బంది, ట్రస్ట్‌బోర్డు సభ్యులతో ఏఈవో ఇజిరోతు శ్రీనివాసరావు ప్రతిజ్ఞ చేయించారు. భారతదేశ పౌరులమైన మేము ప్రజాస్వామ్యంపై విశ్వాసంతో స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, కులమతాలకు అతీతంగా ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేస్తామని ప్రతిజ్ఞ చేశారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు, ఈఈ శ్రీనివాసరావు, ఏఈవో శ్రీనివాసమ్, డీఈ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న తహసీల్దార్ సత్యనారాయణ తదితరులు

ఓటు వజ్రాయుధం వంటిది

పరవాడ: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం వంటిదని ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటు నమోదుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఓటరు గుర్తింపు కార్డు పొందడానికి ఇకపై మీసేవను ఆశ్రయించాల్సిన పనిలేదన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సొంతంగా డౌన్‌లోడ్ చేసుకునే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించిందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో వి.హేమసుందర్రావు, తహసీల్దారు వి.ప్రకాశరావు, వైస్ ఎంపీపీ బి.అప్పలరాజు, ఈవోఆర్డీ పద్మజ, కలపాక సర్పంచ్ బొండా కనకారావు, ముత్యాలమ్మపాలెం ఎంపీటీసీ అరిజిల్లి దేవి, వెన్నలపాలెం ఉప సర్పంచ్ వెన్నల సన్యాసిరావు, నాయకులు నందవరపు శ్రీను, కావలి రాజు, వాసు, బొద్దపు చిన్నారావు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీపీ వెంకటపద్మలక్ష్మి

పెందుర్తిలో..

సింహాచలం: జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని బుధవారం పెందుర్తి మండలంలో వాడవాడలా ఘనంగా నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ రంగకుమారి ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. అలాగే పెందుర్తి ఆదర్శ్ కళాశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఓటు హక్కు ప్రాముఖ్యతను కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌ఈ ఫ్లోరా వివరించారు. పలు పోటీల విజేతలకు బహుమతులు అందించారు.



ర్యాలీ నిర్వహిస్తున్న పెందుర్తి తహసీల్దార్ కార్యాలయ ఉద్యోగులు

శారదాపీఠం వద్ద ఏర్పాట్ల పరిశీలన



శారదాపీఠం రహదారిపై ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: విశాఖ శ్రీశారదాపీఠం వార్షికోత్సవాల్లో భాగంగా 28 వతేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శారదాపీఠానికి వస్తుండడంతో సంబంధిత ఏర్పాట్లను బుధవారం ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పరిశీలించారు. జోన్-8 జీవీఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులతో శారదాపీఠం ప్రాంతంలో పర్యటించారు. వార్షికోత్సవాలకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి, పలువురు ప్రముఖులు శారదాపీఠం సందర్శనకు వస్తుండడంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శారదాపీఠం వార్షికోత్సవాల్లో పాల్గొనేందుకు సీఎం వైఎస్ జగన్ ఈనెల 28న ఉదయం 11గంటల సమయంలో శారదాపీఠానికి వస్తారని తెలిపారు. కార్యక్రమంలో పెందుర్తి ట్రాఫిక్ సీఐ అశోక్‌కుమార్, జెడ్పీ మల్లలయ్యానాయుడు, టౌన్‌ప్లానింగ్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ శాస్త్రి, 93వవార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దాసరి రాజు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

• ఎంపీపీ బోకం సూర్యకుమారి



ట్రై సైకిల్స్ పంపిణీ చేస్తున్న ఎంపీపీ సూర్యకుమారి, జెడ్పీ వైస్ ఛైర్మన్ తుంపాల

సబ్బవరం: పరిసరాల పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని ఎంపీపీ బోకం సూర్యకుమారి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో జిల్లా పరిషత్ వైస్ ఛైర్మన్ తుంపాల అప్పారావుతో కలిసి బుధవారం పలు పంచాయతీలకు ట్రై సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణ మనందరి బాధ్యత కావాలన్నారు. పరిశుభ్రతతోనే ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధ్యమవుతుంతని తెలిపారు. స్వచ్ఛభారత్ మిషన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు గ్రామ పంచాయతీలకు రూ.8.68 లక్షలతో రెండో విడత 21 ట్రై సైకిళ్లు పంపిణీ చేశారు. ఇప్పటి వరకూ మండలంలోని 24 గ్రామ పంచాయతీలకు రూ.18.20 లక్షలతో 44 ట్రై సైకిళ్లు పంపిణీ చేసినట్లు ఎంపీపీ సూర్యకుమారి చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు కొటాన రాము, మాజీ ఎంపీపీ సబ్బవరపు నారాయణమూర్తి, ఎంపీడీవో రమేష్ నాయుడు, నాయకులు బోకం రాము నాయుడు,సబ్బవరపు నారాయణమూర్తి, సర్పంచ్‌లు మోపాడ అప్పారావు,వడ్డాది అప్పలరాజు, ఏవో ఎస్ బాబూరావు,ఈవోఆర్‌డీ మహేష్, యడ్ల నాయుడ తదితరులు పాల్గొన్నారు.

ఏపీపీఎస్‌ఏ డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న డీఈవో చంద్రకళ, డిప్యూటీ డీఈవో గౌరీశంకర్

కంచరపాలెం:ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ 2023-డైరీని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో బుధవారం ఏపీపీఎస్‌ఏ రాష్ట్ర అధ్యక్షుడు జె.సోమశేఖర్ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖాధికారి కె.చంద్రకళ, డిప్యూటీ డీఈవో గౌరీశంకర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.రామకృష్ణ, కార్యదర్శి సీహెచ్ రమేష్, కార్యనిర్వాహణ కార్యదర్శి డీవీ శ్రీనివాస్, కోశాధికారి సీహెచ్ శ్రీనివాస్, సలహాదారులు ఎం.శ్రీనివాసరావు, పి.గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

29న భువనేశ్వరి అమ్మవారి అధివాసం



అల్లిపురం: ఓం భువనేశ్వరి సంస్థాన్ ట్రస్టు ఆధ్వర్యంలో ఈ నెల 29న సబ్బవరం మండలంలోని మణిపురంలో గల భువనేశ్వరీదేవి ఆరాధన పీఠంలో అమ్మవారికి వాకుడు (బజీభతి)పత్రితో అధివాసం నిర్వయించినట్లు సంస్థాన్ ట్రస్ట్ నిర్వాహకులు మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు అమ్మవారికి మంగళస్నానం, దివ్య పంచామృతాలు, పాలు తదితరాలతో శుద్ధి చేసి శాస్త్రోక్తంగా అధివాసం జరుపుతామని పేర్కొన్నారు. భక్తులు పూజలు చేసి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

సైకిల్ పైనుంచి పడి బాలుడి మృతి

మల్కాపురం: స్కూల్ నుంచి వచ్చిన బాలుడు సరదాగా సైకిల్ తొక్కుతూ అదుపు తప్పి మృతి చెందాడు. దీంతో బాలుడి బంధువులు, తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ ఘటనపై మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలు.. జీవీఎంసీ 59వ వార్డు ఎక్స్‌సర్వీస్‌మెన్‌కాలనీలో కాశీ వికాష్(12) అనే బాలుడు తండ్రి గణేష్, తల్లితో కలిసి నివాసం ఉంటున్నాడు. తండ్రి కోరమాండల్ బస్టాప్ వెనుక గల ప్రధాన మార్గంలో ఉమా జ్యూయలర్స్ (బంగారం షాపు) నడుపుతున్నాడు. జవహర్‌నగర్‌లోని సరస్వతీ విద్యా విహార్ పాఠశాలలో వికాష్ 8వ తరగతి చదువుతున్నాడు. అయితే బుధవారం సాయంత్రం పాఠశాల ముగిసిన తర్వాత ఇంటికి వచ్చిన వికాష్ సైకిల్ తీశాడు. సాయిబాబా ఆలయానికి ఆనుకుని ఉన్న సర్వీసు రోడ్డులో సైకిల్ తొక్కుతున్నాడు. ఆ మార్గం బాగా ఎత్తు (అప్)లో ఉండడంతో ఎత్తుకు సైకిల్ తీసుకువెళ్లి, ఆ పల్లం (డౌన్) మార్గంలో సైకిల్‌పై అతి వేగంగా వచ్చాడు. దీంతో సైకిల్ అదుపు తప్పి కింద పడిపోయాడు. ఈ ఘటనలో వికాష్ తలకు గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్టు తెలిసింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక సెయింట్ ఆన్స్ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అయితే అప్పటికే బాలుడు మృతి చెందినట్టు అక్కడ వైద్యులు తెలపడంతో మల్కాపురం పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసి శవ పరీక్ష నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

స్వీయ కథా పఠనం



కథా పఠనం చేస్తున్న రచయిత భాగవతుల సత్యనారాయణమూర్తి

సీతంపేట: సహృదయ సాహితి ఆధ్వర్యంలో స్థానిక ప్రిజమ్ కళాశాలలో బుధవారం స్వీయ కథా పఠనం సాహిత్య కార్యక్రమం జరిగింది. విభిన్న సామాజిక అంశాలపై రచయితలు తమ స్వీయ కథలను చదివి వినిపించారు. సభాధ్యక్షత వహించిన సిహెచ్.చిన సూర్యనారాయణ, ప్రముఖ రచయిత ద్విభాష్యం రాజేశ్వరరావు కథానిక అమృత హస్తంను విశ్లేషించారు. ప్రముఖ రచయిత మేడా మస్తాన్ రెడ్డి మాట్లాడుతూ కథల్లో ప్రధానమైనవి అంశం, కథాశిల్పం, కథనం చక్కగా కుదిరితే పాఠకుల మనసుల్లో చెరగని ముద్ర వేసుకుంటాయన్నారు. అనంతరం ఉపశమనం కథను వినిపించారు. రచయిత భాగవతుల సత్యనారాయణమూర్తి 'విచిత్ర ప్రయాణం' కథానిక, చిన సూర్యనారాయణ 'తెలివి తక్కువ'కథను, సి.ఎస్.వి.ఎస్.కృష్ణారావు, రామతాత కథలను విశ్లేషించారు.

యువతి ఆత్మహత్య

• ఇష్టంలేని పెళ్లి కుదర్చడమే కారణం

సింహాచలం: ఇష్టంలేని పెళ్లి కుదిర్చారని యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పెందుర్తి నుంచి పులగానిపాలెం వెళ్లే మార్గంలోని ఎంఎస్‌రామయ్య అపార్ట్‌మెంట్‌లో చోటుచేసుకుంది. గోపాలపట్నం సీఐ గొలగాని అప్పారావు తెలిపిన వివరాలు ... ఎంఎస్ రామయ్య అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న సౌజన్య(25) హైదరాబాద్‌లోని ఇన్ఫోసిస్‌లో ఉద్యోగం చేస్తోంది. ప్రస్తుతం వర్క్ ఫ్రమ్ హోమ్ చేస్తోంది. తల్లిదండ్రులు ఇష్టం లేని పెళ్లి కుదర్చడంతో మంగళవారం ఉదయం 11గంటల సమయంలో ఇంట్లోని తన గదిలోకి వెళ్లి తలుపువేసుకుంది. అయితే శిరీష తరచూ అలిగి తలుపులు వేసుకోవడం, భోజనానికి పిలిచినా రాకపోవడం, రాత్రి అందరూ పడుకున్న తర్వాత వచ్చి భోజనం చేసే అలవాటు ఉంది. ఈ తరుణంలోనే రాత్రి వరకు గదిలో నుంచి బయటికి రాకపోయినా తల్లిదండ్రులు పెద్దగా పట్టించుకోకుండా పడుకున్నారు. బుధవారం తెల్లవారుజామున కూడా శిరీష బయటికు రాకపోవడంతో అనుమానం వచ్చి చూడగా ఉరివేసుకుని ఉంది. దీంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పెందుర్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శిరీష తండ్రి వెంకటరమణ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నారు.

నేడు సరస్వతీ పూజలు

ఉక్కునగరం: వసంత పంచమిని పురస్కరించుకుని స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని త్రిశక్తి దేవాలయం, హనుమాన్ దేవాలయాల్లో గురువారం సరస్వతీ పూజలు నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. సరస్వతీ దేవి జన్మ నక్షత్రం సందర్భంగా త్రిశక్తి దేవాలయంలో సరస్వతి దేవి అమ్మవారికి వేకువజామున 4 గంటలకు పంచామృతాభిషేకాలు చేయనున్నారు. అనంతరం ఉదయం 6.30 గంటలకు సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించనున్నారు. సాయంత్రం 5 గంటలకు మహాసరస్వతి మూల మంత్ర ప్రయుక్త అఖండ విద్యా హోమం, 6 గంటలకు సహస్ర నాగవల్లి పత్ర సహిత శ్వేత పుష్పార్చన చేయనున్నారు. ఆసక్తి గలవారు వేకువజామున హాజరు కావాలని ఆలయ ప్రధానార్చకులు ఫణిశర్మ కోరారు. హనుమాన్ దేవాలయంలో ఉదయం సరస్వతీ దేవికి ప్రత్యేక పూజలు చేయనున్నారు. ఉదయం 11 గంటలకు పుష్పాంజలి పూజ, 11.30 గంటలకు అక్షరాభ్యాసాలు నిర్వహించనున్నారు.

జంతువులపై ప్రేమ అవసరం



మాట్లాడుతున్న పశు సంవర్ధక శాఖ డీడీ కరుణాకరరావు

ఆరిలోవ: చిన్నతనం నుంచే జంతువులపై ప్రేమ చూపాల్సిన అవసరం ఉందని పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కరుణాకరరావు తెలిపారు. జంతు సంక్షేమ పక్షోత్సవాలలో భాగంగా పశు సంవర్ధక శాఖ చినగదిలి వెటర్నరీ ఆస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం తోటగరువు హైస్కూల్‌లో విద్యార్థులకు జంతువులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీడీ మాట్లాడుతూ జంతువులను హింసించకూడదన్నారు. వాటిని కూడా తోటి స్నేహితులు మాదిరిగా ప్రేమతో చూడాలన్నారు. జంతువులను హింసిస్తే చట్టరీత్యా నేరం చేసినవారవుతారని చెప్పారు. వేసవి కాలంలో పక్షులకు నీటిని అందుబాటులో ఉంచడం, గూళ్ల ఏర్పాటు చేయడం వంటి అలవాట్లు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీ డాక్టర్ శ్రీనివాసరావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మలుపు.. ప్రమాదాలకు పిలుపు!



ప్రమాదకరంగా ఉన్న తిక్కవానిపాలెం రహదారి మలుపు

పరవాడ: వాడచీపురుపల్లి-తిక్కవానిపాలెం రహదారిలో ఊటగెడ్డ ఎస్సీ కాలనీ సమీపంలోని మలుపు ప్రయాణికుల పాలిట శాపంగా మారుతోంది. అతి దగ్గర మలుపు కావడంతో పాటు రోడ్డుకిరువైపులా దట్టంగా పెరిగిన తుప్పలు, డొంకలు కారణంగా ఎదురెదురుగా రాకపోకలు సాగించే వాహనాలు కనిపించడం లేదు. ఫలితంగా తరచూ ఈ మలుపు వద్ద ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అయినా పంచాయతీ, ఆర్ అండ్ బీ అధికారులు మలుపు వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు వంటి కనీస చర్యలు చేపట్టడం లేదు. మలుపుల వద్ద పెరిగిన తుప్పలు తొలగించడం ద్వారా ప్రమాదాలను నివారించడం సాధ్యపడుతుందని ప్రయాణికులు సూచిస్తున్నారు.

బ్యాంకు ఉద్యోగుల సమ్మె విజయవంతానికి పిలుపు



పిఠాపురం కాలనీ యూనియన్ బ్యాంకు వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

మద్దిలపాలెం: దేశ వ్యాప్తంగా ఈ నెల 30, 31వ తేదీలలో తలపెట్టిన సమ్మెను బ్యాంకు ఉద్యోగులంతా విజయవంతం చేయాలని విశాఖ జిల్లా బ్యాంకు ఉద్యోగుల సమన్వయ సంఘం సభ్యులు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం పిఠాపురం కాలనీలోని యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా వద్ద సంఘీభావం నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం పలు బ్యాంకు ఉద్యోగుల సంఘాల నాయకులు మాట్లాడుతూ వారానికి ఐదు రోజుల బ్యాంకు పని దినాలను అమలు చేయాలని, కొత్త పెన్షన్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. విశ్రాంత ఉద్యోగులు పెన్షన్ అప్‌డేట్ చేయాలని కోరారు. ఖాతాదారులకు మెరుగైన సేవలందించడానికి అన్ని విభాగాలలో ఖాళీలను భర్తీ చేయాలన్నారు.

నిగ్గు తేల్చేందుకే ఉక్కు ప్రజాగర్జన

కూర్మన్నపాలెం: భారత రాజ్యాంగంపై ప్రమాణం చేసినప్పటికీ, రాజ్యాంగ విలువలను మరిచి కార్మిక హక్కులను కాలరాస్తూ ప్రజల డబ్బుతో పెత్తనం చెలాయిస్తున్న కేంద్ర ప్రభుత్వం నిగ్గు తేల్చే ప్రయత్నంలో భాగమే ఉక్కు ప్రజాగర్జన సభ అని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 713వ రోజు చేరుకున్నాయి. దీక్ష శిబిరంలో ఎస్‌ఎంఎస్-2 విభాగం నుండి కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వీరిని ఉద్దేశించి విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకుడు వరసాల శ్రీనివాసరావు మాట్లాడారు. కేంద్రంతో పాటు ప్రస్తుత విశాఖ ఉక్కు యాజమాన్యం కూడా ప్రైవేటీకరణలో భాగంగా కేంద్రానికి సహకరిస్తూ ఒక్కొక్క అడుగు ముందుకు వేయాలని ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. వీరి ప్రయత్నాలు సాగవని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకుని, పార్లమెంట్‌లో ఉపసంహరణ బిల్లును ప్రవేశపెట్టాలని, లేకుంటే తమ పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నెల 30వ తేదీన నిర్వహించే ఉక్కు ప్రజాగర్జన సభకు కార్మికులు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, జె.రామకృష్ణ, ఆయోధ్యరామ్ పాల్గొన్నారు.

సచ్చిదానందమూర్తి సేవలు నిరుపమానం

ఏయూ క్యాంపస్: ప్రముఖ తత్వవేత్త, యూజీసీ మాజీ ఉపాధ్యక్షుడు కొత్త సచ్చిదానందమూర్తి 12వ వర్ధంతి కార్యక్రమం ఆంధ్ర విశ్వవిద్యాలయం తత్వశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో బుధవారం జరిగింది. ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో ఉన్న ఆయన విగ్రహానికి ఆచార్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణ, కొత్త సచ్చిదానందమూర్తి, ప్రొఫెసర్ పి.టి.రాజు వంటి ప్రపంచ స్థాయి తత్వవేత్తలను ఏయూ తత్వశాస్త్ర విభాగం అందించిందన్నారు. ఆచార్య వి.కృష్ణయ్య మాట్లాడుతూ విభాగానికి సచ్చిదానందమూర్తి చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు.